అభివృద్ధికి సహకారం అందించాలి

సీఎండీ బాలరాంను కోరిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 : నియోజవర్గంలోని సింగరేణి ప్రభావిత ప్రాంతల్లో అభివృద్ధికి సహకారమందించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి సంస్థ సీఎండీ బాలరాం నాయక్‌ను కోరారు. శనివారం హైదరాబాద్‌లో సీఎండీ బలరాంను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎండీగా ఎంపికైనందుకు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి ప్రభావిత గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆమె కోరారు.

సింగరేణి సీఎండీ బాలారాం నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆకట్టుకున్న జంతు సామ్రాజ్యం

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 24 : పట్టణంలోని లక్ష్మీనగర్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శనివారం జంతు సామ్రాజ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు జంతు నిర్మాణాలను ప్రదర్శించారు. వివిధ జంతువుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆయూబ్, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి కృష్ణ వేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జంతువుల వేషధారణలో విద్యార్థులు

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

గూడెంలో ఘనంగా జాతర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

దండేపల్లి, ఫిబ్రవరి 24 : గూడెం శ్రీసత్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం ఘనంగా జాతర జరిగింది. జిల్లా నుంచేగాక జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామునే పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. 252 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్య హోమాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం వైభోపేతంగా నవగ్రహ హోమాలు, జయాది హోమం, శాంతి హోమం, పంచసూక్తహోమ యజ్ఞాలు, బలిహరణం, నిత్య హోమాలు నిర్వహించారు. నిత్యవిధి, ప్రాభోదిక ఆరగింపు, తీర్థప్రసాదగోష్టి, హవనం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ప్రధాన అర్చకులు గోవర్ధన రఘుస్వామి, అర్చకులు సంపత్‌స్వామి, వేద పండితులు నారాయణ శర్మ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు.

ఎమ్మెల్యేలకు నో ఎస్కార్ట్

- తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో కాంగ్రెస్ శాసనసభ్యులు లేకపోవడంతోననే చర్చ
- ఏదైనా జరిగితే బాధ్యతెవ్వరిదో..?

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 : రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఎస్కార్ట్ సౌకర్యం తొలగించినట్లు తెలిసింది. గతంలో ఎమ్మెల్యేల పర్యటనల సందర్భంగా కాన్వాయ్ ముందు, వెనకాల పోలీసు ఎస్కార్ట్ ఇచ్చేవారు. పైలెట్‌గా వెళ్లే పోలీసు వాహనం హారన్ ఇస్తూ ముందు కెళ్లేది. దాని వెనకాల ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్లేది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు ఎస్కార్టు ఇవ్వడం లేదు. ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే మంత్రులు, హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు మాత్రమే ఎస్కార్ట్ ఇస్తున్నారు. అదీ కూడా సీఎంవో నుంచి వచ్చే రేడియో మెసేజ్ ఆధారంగా ఎస్కార్ట్ ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యేలకు ఎస్కార్ట్ ఇవ్వకపోవడంతో వారు కొంత అసహనానికి గురువుతున్నారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు ఈ విధానం పాటిస్తున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలు లేకనే..

ఆసిఫాబాద్ జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కోవలక్ష్మి, సిర్పూర్‌లో బీజేపీగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు లేకపోవడంతోనే ఎస్కార్ట్ తొలగించినట్లు చర్చ సాగుతోంది. జిల్లాలో ఎక్కవగా అటవీప్రాంతం ఉంది. అడవి గుండా ప్రయాణిస్తున్నప్పుడు ఏదైనా ఘటన జరిగితే ఎవ్వరిది బాధ్యతనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. హంగూ.. ఆర్భాటాలు లేకుండా ప్రజల్లో తిరగాలన్న ఉద్దేశంతో ఎస్కార్ట్ తొలగించినట్లు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మరి ఆ పార్టీ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా స్పందించకపోవడం గమనార్హం.

'అక్రమాల శ్రీరంగం'పై కదిలిన యంత్రాంగం

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

- శనివారం ఉదయమే వెంచర్‌ను పరిశీలించిన అధికారులు
- చెరువు కట్టపై అనధికారికంగా రోడ్డు వేయడంపై ఇరిగేషన్‌శాఖ సీరియస్
- నిర్వాహకులపై చర్యలకు సిద్ధం

చెరువుకట్టపై వేసిన రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈ

మంచిర్యాల, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రంగంపేట శివారులో ఎనిమిది ఎకరాల్లో అనధికారిక వెంచర్ వెలియగా, శనివారం 'నమస్తే తెలంగాణ'లో 'అక్రమాల శ్రీరంగం' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. డీటీసీపీ అనుమతులు తీసుకోకుండా, టీపీ(టెంటిటేటివ్ లే-అవుట్) పర్మిషన్ లేకుండా ప్లాట్లు చేసి.. అన్ని అనుమతులున్నాయంటూ 'శ్రీ రంగం హిల్స్ బై అవర్ డ్రీమ్ ప్రాజెక్ట్' సంస్థ విక్రయాలకు సిద్ధమైందని, దాదాపు రూ.30 లక్షలు ఖర్చు పెట్టి రంగంపేట చిన్నకుంట చెరువు కట్టపై నుంచి వెంచర్ వరకు అనధికారికంగా రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేసిందని అందులో పేర్కొనగా, యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నది. కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు వెంచర్‌ను, చెరువు కట్టపై వేసిన రోడ్డును శనివారం ఉదయాన్నే పరిశీలించారు. తహసీల్దార్ రమేశ్.. వెంచర్ నిర్వాహకులైన నీలి శ్రీనివాస్‌ను సంప్రదించి.. సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని కోరారు. ఇందుకు ఆయన హోమంలో ఉన్నానని, సాయంత్రం వస్తానని చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. నాలా కన్వర్షన్ ఎన్ని ఎకరాలకు ఉంది. వెంచర్ ఎన్ని ఎకరాల్లో ఏర్పాటు చేశారు. నిర్వాహకుల పేరుపై ఎంత భూమి ఉంది.. మిగిలిన వ్యవసాయ భూమి ఎవరి పేరుపై ఉందనే వివరాలు తెలుసుకున్నాక చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు కట్టపై నుంచి రోడ్డు వేయడంపై ఇరిగేషన్ శాఖ అధికారులు సీరియస్ అయ్యారు. రోడ్డును పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ గౌతమ్ స్పందిస్తూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు బాధ్యులకు నోటీసులు ఇస్తామని చెప్పారు. మున్సిపాలిటీకి దరఖాస్తు చేయకుండా డీటీసీపీ లే-అవుట్ అంటూ విక్రయాలు చేస్తుండడం, టీపీ పర్మిషన్ తీసుకోకుండా ప్లాట్లు ఏర్పాటు చేయడంపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ సూచించినట్లు మున్సిపల్ కమిషన్ మారుతీ ప్రసాద్ తెలిపారు. కోర్టు కేసు విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులు హైదరాబాద్ వెళ్లారని, రాగానే వెంచర్‌ను పరిశీలించి తగు చర్యలకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఈ వెంచర్ పక్కన అటవీశాఖ భూములున్నట్లు తెలిసింది. ఈ లెక్కన సదరు వెంచర్ నిర్వాహకులు అటవీశాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుందని తెలిసింది.

నమస్తే ఎఫెక్ట్

చెరువు తూమును దాటుకొని రోడ్డు నిర్మాణం..

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే శ్రీరంగం హిల్స్ వెంచర్‌కు వెళ్లాలంటే చెరువు కట్ట మార్గం తప్ప.. ప్రత్యామ్నాయం లేదు. ఈ వెంచర్ పక్కనుంచే నేషనల్ హైవే -63 ప్రతిపాదిత రోడ్డు వెళ్తుంది. అది పూర్తయితే ఈ భూమి హాట్ కేక్‌లా మారుతుంది. కాకపోతే ఆ లోగా తమకు అనుకూలంగా మార్చుకోవాలనే ఉద్దేశంతో కట్టపై రోడ్డు వేసినట్లు తెలుస్తున్నది. సాధారణంగా ఏ చెరువు కట్ట అయినా.. ఎడ్లబండి వెళ్లేంత బాట (10 ఫీట్ల నుంచి 13 ఫీట్లు) ఉండాలి. కానీ దాన్ని దాదాపు 20 ఫీట్లకు పెంచారు. ఇందుకోసం కొంత వరకు చెరువును లోపలి నుంచి పూడ్చుకుంటూ వెళ్లారు. కట్టకు ఇరువైపులా చెట్లను సైతం నరికివేశారు. విచిత్రం ఏమిటంటే చెరువు తూమును దాటి రోడ్డు వేశారు. సాధారణంగా ఏ కట్టపైనైనా తూము ముందుకు ఉంటుంది. కానీ.. స్వలాభం కోసం దాన్ని దాటి రోడ్డు వేశారు. ఈ విషయాలన్నీ ఇరిగేషన్ శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నిబంధనలు అతిక్రమించిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారా.. లేక నామమాత్రంగా నోటీసులు ఇచ్చి సరిపెడతారా.. అనేది చూడాల్సి ఉంది.

రంగంపేట శివారులోని శ్రీరంగం హిల్స్ వెంచర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

తూము దాటుకొని వెళ్లిన రోడ్డు

గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరకు పోటెత్తిన భక్తులు

నమో వేంకటేశా..

- గోవిందుడి నామస్మరణతో మారుమోగిన గంగాపూర్ జాతర
- కనుల పండువగా రథోత్సవం
- పోటెత్తిన భక్తజనం.. బారులు తీరి మొక్కులు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

రెబ్బెన, ఫిబ్రవరి 24 : గంగాపూర్ గ్రామ శివారులో బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర అంగరంగ వైభవంగా సాగుతున్నది. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం రెండో రోజూ భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచేకాకుండా పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉదయం 4 గంటల నుంచే స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. ఇక రథోత్సవం కనుల పండువగా నిర్వహించగా, గోవిందుడి నామస్మరణతో భక్తజనం పులకించిపోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో పాటు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ(స్థానిక సంస్థలు), వేణు(రెవెన్యూ), కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రెబ్బెనకు చెందిన వ్యాపారులు అన్నదానంతో పాటు మంచినీరు అందించగా, రెబ్బెన పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్ పారిశుధ్యంపై పర్యవేక్షించారు. పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ అందించారు. డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో ఏడుగురు సీఐలు, 13 మంది ఎస్ఐలు, 100 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జయరాం, సభ్యులు గంటుమేర, రాజా గౌడ్, నర్సింగరావు, మురళీ, దుప్పనాయక్, తులసీరాం, విమల, అన్నాజీ, వడ్డె మల్లేశ్, వనమాల స్వప్న, ఈవోలు వేణుగోపాల్‌గుప్తా, బాపురెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేముర్ల సంతోశ్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, గౌడ సంఘం అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ బోర్కడే హేమంత్

జాతరలో రథాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఊట చెలిమ వద్ద పూజలు చేస్తున్న పూజారి

అభిషేకించి.. పూజలు చేసి..

అంగరంగ వైభవంగా గాంధారీ ఖిల్లా మైసమ్మ జాతర

- గంగాజలాలతో దేవతా మూర్తుల విగ్రహాలు శుద్ధి
- తప్పెటగూళ్లు, పిల్లన గ్రోవుల వాయిద్యాల నడుమ ప్రదర్శనలు
- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

ఘటాలలో గంగా జలం (చెలిమ నీళ్లు, గోదావరి జలం) తీసుకు వస్తున్న మహిళలు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 24 : గాంధారీ ఖిల్లా మైసమ్మ జాతర శనివారం రెండో రోజూ అంగరంగ వైభవంగా సాగింది. గోదావరి నుంచి తెచ్చిన పవిత్ర గంగాజలంతో గ్రామ దేవతలైన తిమ్మాపూర్ నల్లపోశమ్మ, భీమన్న విగ్రహాలను అభిషేకించి శుద్ధి చేశారు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. బొక్కల గుట్ట గ్రామం నుంచి కిలో మీటర్ దూరాన.. రాష్ట్ర రహదారి పక్కన కొలువైన గాంధారీ మైసమ్మ తల్లికి పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు, యాటపోతులతో మొక్కులు చెల్లించుకున్నారు. సదర్ల (దారి) భీమన్న వద్దనుంచి సాయంత్ర తప్పెటగూళ్లు, పిల్లనగ్రోవుల వాయిద్యాల నడుమ నాయక్‌పోడ్ కళాకారులు నృత్యాలు చేస్తూ.. ఊరేగింపుగా గాంధారీఖిల్లా దిగువకు గోదావరి నదీజలాలను తీసుకెళ్లారు. నాయక్‌పోడ్ మహిళలు అక్కడి చెలిమ నీళ్లు, 21 ఘటాల (కూరాడు కుండలు) గోదావరి జలాలను తీసుకెళ్లి ఖిల్లా ప్రథమ ద్వారం వద్ద కొలువైన కాలభైరవునికి అభిషేకం చేశారు. ఆపై కోట ప్రధాన ద్వారంపైన కొలువైన మైసమ్మ తల్లి (లక్ష్మీదేవర)ని గంగా జలంతో అభిషేకించారు. పన్నెండు తలల నాగశేషుడు, విఘ్నేశ్వరుడు, ఆంజనేయుడు, శివపార్వతుల విగ్రహాలను గంగా జలంతో శుద్ధి చేశారు. గుట్ట దిగువన రాత్రి నుంచి తెల్లారే వరకు గిరిజన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. లక్ష్మీదేవర, కృష్ణస్వామి (శ్రీకృష్ణుడు), పోతరాజు, మదన పోచమ్మ, మాంతమ్మ, చంద్రమ్మ, పంచపాండవుల ముఖతొడుగులు ధరించి తప్పెటగూళ్లు, పిల్లనగ్రోవుల వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. అర్ధరాత్రి దాటాక మైసమ్మ దేవత వద్ద పట్నాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు యాటలు బలి ఇచ్చారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి భక్తులు దర్శించుకుంటారు. తాండూర్ (మందమర్రి ఇన్‌చార్జి) సీఐ శ్రీనివాసరావు శనివారం సాయంత్రం మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆయన వెంట రామకృష్ణాపూర్ ఎస్ఐ జీ. రాజశేఖర్ ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో పూజారులు మైసయ్య,రొడ్డ పెద్దరాజం, నాయకపోడ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, ప్రధాన కార్యదర్శి బైర్నేని లక్ష్మణ్, కోశాధికారి బత్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గుండ రాజేశ్, మార్నేని భూమేశ్, తేనేని రవి, రెడ్డి లక్ష్మణ్, మేసినేని రాజయ్య, గంజి రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాళ భైరవుని విగ్రహానికి అభిషేకం చేస్తున్న పూజారులు, భక్తులు

అధికారుల్లో బదిలీ గుబులు

- మరోసారి ట్రాన్స్‌ఫర్స్ తప్పేలా లేవు
- జిల్లా నుంచి మరో జిల్లా ప్రాతిపదిక కాదు
- పార్లమెంట్ పరిధి మొత్తం దాటి పోవాల్సిందే

మంచిర్యాల, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సమాయత్తమవుతున్నది. ఈ మేరకు ఇటీవల జిల్లాల్లో మూడేళ్లకు మించి సర్వీస్ కలిగి ఉన్న అధికారులను బదిలీ చేశారు. కొన్ని రోజుల క్రితమే రెవెన్యూ సహా ఎన్నికల విధి నిర్వహణలో పాల్గొనే ఇతర శాఖల అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు భార్య, పిల్లలతో షిఫ్ట్ కూడా అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం పని చేస్తున్న జిల్లా నుంచి మరొక జిల్లాకు బదిలీ చేస్తే సరిపోతుందనుకుంటే.. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా వేరే పార్లమెంట్ నియోజకవర్గానికి బదిలీ చేయాలని ఎన్నికల సంఘం నిబంధనల్లో స్పష్టం చేసింది. పని చేసిన జిల్లాతో పాటు సొంత జిల్లా కూడా అదే పార్లమెంట్ పరిధిలో ఉండకూడదని స్పష్టం చేసింది. దీంతో పెద్దపల్లి జిల్లా రామగుండం, మంథని నియోజకవర్గాలు, జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో పని చేసి మంచిర్యాలకు బదిలీపై వచ్చిన అధికారులను మరోసారి బదిలీ చేయాల్సి వస్తుంది. మరోవైపు మంచిర్యాల జిల్లాలో చేసి ఆసిఫాబాద్‌కు బదిలీ అయిన కొందరు అధికారుల సొంత గ్రామాలు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్నాయి. ఆ లెక్కన వారు అక్కడ స్థానికులయ్యారు. బదిలీలు తప్పవని అధికారులు చెబుతుండగా, ఈ లెక్కన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 20 నుంచి 30 మంది అధికారులకు పైగా బదిలీ కానున్నారు. ఇటీవలే డీపీఆర్‌వోలను బదిలీ చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా డీపీఆర్‌వోకు ముందు మంచిర్యాలలో పోస్టింగ్ ఇచ్చారు. కానీ, ఆయన సొంత జిల్లా మంచిర్యాల కావడంతో ఆయన్ని భూపాలపల్లికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో సిరిసిల్ల పోస్టింగ్ తీసుకున్న శారదను స్థానికత పేరు చెప్పి మంచిర్యాలకు పంపారు. ఇలా బదిలీ ఆర్డర్లు ఇవ్వడం, తీరా బాధ్యతలు స్వీకరించాక కారణాలు చెప్పి వెంటనే బదిలీ చేయడంపై ఉద్యోగులు పరేషాన్ అవుతున్నారు. నెల.. రెండు నెలల వ్యవధిలోనే ఇలా ట్రాన్స్‌ఫర్ చేయడం ఏమిటని ఆందోళన చెందుతున్నారు.